



మచిలీపట్నం ఏరియల్ వ్యూ

తనకు రావాల్సిన సీటు కొట్టేశాడనే అక్కసుతో ఒకరు... తనను ఓడిస్తాడేమోననే భయంతో మరొకరు... వెన్నుపోటుదారుడిని ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో ఒకరు... అందరి ఓట్లు లాగేసుకునేదాకా భరించి ఆ తరువాత లెక్క సరిచేయాలనే ధోరణితో మరొకరు.. ఇలా ఒకరిపై ఒకరు లోలోపల కత్తులు దూస్తున్నారు. పైకి మాత్రం ఏ సమస్యా లేనట్టు.. అంతా కలిసిమెలిసి ఉన్నట్టు.. నవ్వులు విరజిమ్ముతూ.. ఐక్యత నటిస్తూ.. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వైసీపీలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుత పరిస్థితి ఇదీ. విజయవాడ సెంట్రల్, పెనమలూరు నియోజకవర్గాల్లో ఇది తీవ్రస్థాయికి చేరింది. నేతలతోపాటు వారి గ్రూపులకూ పాకింది. తమ నేతల ఎదుటే మాటల కత్తులు దూసేదాకా వెళ్లింది.



పైకి నవ్వులు.. లోన కత్తులు!

- సెంట్రల్‌లో మల్లాది వర్సెస్ వెలంపల్లి
- నేడు వెలంపల్లి కార్యాలయం ప్రారంభం
- మల్లాదికి ఆహ్వానం.. అయినా ముభావంగానే..
- పెనమలూరులో జోగికి గ్రూపుల సెగ
- ఆయన ఎదుటే బూతులు తిట్టుకున్న ఇరువర్గాలు

సెంట్రల్, పెనమలూరులలో వైసీపీ దుస్థితిదీ..

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

'శత్రువునైనా నమ్మవచ్చు కానీ మిత్రుడు రూపంలో ఉన్న శత్రువును నమ్మకూడదు. వెలంపల్లి అలాంటి వ్యక్తే. అన్నా- అన్నా అంటూనే ద్రోహం చేశాడు. అన్నా అంటుంటే తమ్ముడని నమ్మాను. కానీ నమ్మక ద్రోహం చేసి వెన్నుపోటు పొడుస్తాడనుకోలేదు. నేను కూడా అతనిలాగే రాజకీయం చేసి ఉంటే అతను అసలు రాజకీయాల్లోనే ఉండేవాడు కాదు' అని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తన సన్నిహితుల వద్ద ఇటీవల వ్యాఖ్యానించారు. విజయవాడ పశ్చిమ నుంచి సెంట్రల్ వైసీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు విషయంలో విష్ణు, ఆయన అనుచరులు అవమానభారంతో రగిలిపోతున్నారు. పార్టీ పెద్దలను పక్కదారి పట్టించి వెలంపల్లి టికెట్ తెచ్చుకున్నారని వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందు చేతులు కలుపుతున్నా వెనుక మాత్రం కత్తులు దువ్వుతున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో వెలంపల్లి శ్రీనివాసరావు సెంట్రల్ నియోజకవర్గంలో తన కార్యాలయాన్ని 25న ప్రారంభించనున్నారు. కార్యాలయ ప్రారంభానికి ఆహ్వానించేందుకు వెలంపల్లి బుధవారం మల్లాది విష్ణుని కలిశారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా విష్ణుని ఆహ్వానించారు. దీనిపై మల్లాది విష్ణు వస్తానని కానీ రానని కానీ చెప్పకుండా ముభావంగా ఉండిపోయినట్టు సమాచారం. వెలంపల్లితో భేటీ అనంతరం విష్ణు తన అనుచరులతో గాయత్రి కల్యాణమండపంలో ఆత్మీయసమావేశం పేరుతో భేటీ అయ్యారు. ఈ భేటీలో మల్లాది విష్ణు కీలక నిర్ణయం తీసుకోనున్నారని ఎదురుచూసిన అనుచరులను నిరాశపరుస్తూ.. పార్టీ నిర్ణయాన్ని అందరూ శిరసావహించాలని, వెలంపల్లికి సహకరించాలని విష్ణు చెప్పడం గమనార్హం. అయితే ఈ భేటీలో ఆయన ముభావంగా ఉండటం ద్వారా ఇది బలవంతపు ఆత్మీయ సమావేశం అన్న విషయం అర్థమవుతోందని విష్ణు అనుచరుడు ఒకరు వ్యాఖ్యానించారు. మరోవైపు సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలంటూ లోటస్‌పాండ్‌లోని కొండపల్లి బుజ్జి నివాసంలో సెంట్రల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో వెలంపల్లి బుధవారం భేటీ అయ్యారు. దీనికి కార్పొరేటర్లు

- మిగతా 6లో

హనుమంతు కారణంగానే సారథికి చెక్

తాడిగడప మున్సిపాలిటీలో విలీనమైన పంచాయతీల్లో కానూరు పెద్దది. మున్సిపాలిటీ కాకముందు కానూరు పంచాయతీపై అన్నే చిట్టిబాబుదే ఆధిపత్యంగా ఉండేది. దీనికి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో హనుమంతు పట్టుబట్టి మున్సిపాలిటీగా చేయించారు. కేవలం రాజకీయ ఆధిపత్యంలో భాగంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయించినా అభివృద్ధిని గాలికొదిలేసి వసూళ్లకు తెరలేపారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ఎడాపెడా వసూళ్లకు తెగబడటంతో ఆ ప్రభావం సారథిపై పడింది. దాని ప్రభావం కారణంగానే వైసీపీ సర్వేల్లో సారథికి ప్రతికూలంగా రావడం ఆయనకు టికెట్ నిరాకరించడం జరిగిందని వైసీపీ శ్రేణుల మాట. సారథిపై అవినీతి ముద్రకు ప్రధాన కారణమైన హనుమంతుపై వైసీపీ శ్రేణుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. అలాంటి వ్యక్తికి జోగి రమేశ్ ప్రాధాన్యం ఇచ్చి పార్టీ కోసం కష్టపడే వారిని పక్కన పెడుతుండటాన్ని జీర్ణించుకోలేక మంగళవారం వారు మంత్రి సమక్షంలోనే హనుమంతుపై బూతులతో తిరుగుబాటు చేశారు. ఈ పరిస్థితుల్లో జోగి ఎంత వరకు పెనమలూరులో నెగ్గుకు రాగలడన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మచిలీపట్నం ఎంపీపై మల్లగుల్లాలు

మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి ఎవరిని బరిలోకి దింపాలన్న అంశంపై వైసీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. సిటింగ్ ఎంపీ బాలశౌరి అనూహ్యరీతిలో వైసీపీకి గుడ్‌బై చెప్పడంతో ఇక్కడి నుంచి పలువురి పేర్లను పార్టీ పరిశీలిస్తోంది. మచిలీపట్నంతో అనుబంధం ఉన్న చలమలశెట్టి సునీల్‌ను బరిలో దింపాలని వైసీపీ అధిష్ఠానం భావించినా ఆయన విముఖత చూపుతున్నట్లు సమాచారం. దీంతో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ఎంపీగా నిలబెడితే ఎలా ఉంటుందని వైసీపీ పెద్దలు యోచిస్తున్నారు. ఈ మేరకు ఆయనను సీఎంవోకి పిలిపించి చర్చలు కూడా జరిపారు. బందరు నుంచి టీడీపీ, జనసేన ఎంపీ అభ్యర్థిగా బాలశౌరి బరిలో దిగుతున్నట్లు సమాచారం. ఆయన కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో వైసీపీ కూడా అదే సామాజికవర్గం వ్యక్తిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఉత్తరం.. దక్షిణం...

రెండు మండలాలుగా బందరు విభజన

- 27న రెండో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం
- శిథిలావస్థకు చేరిన భవనంలో నూతన కార్యాలయం
- ఎన్నికల నోటిఫికేషన్ నాటికి రెండో తహసీల్దార్ కార్యాలయం చూపేందుకు అధికారుల పరుగులు
- గతేడాది ఫిబ్రవరి 28వ తేదీనే విభజన ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గంలోని నగర ప్రాంతాన్ని, మచిలీపట్నం మండలాన్ని రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించేందుకు రంగం సిద్ధమైంది. మచిలీపట్నం నగరంలోని 50 డివిజన్లతోపాటు, మండలంలోని 34 పంచాయతీలు ఇప్పటివరకు ఒకే తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉండేవి. పరిపాలనా సౌలభ్యం కోసం మచిలీపట్నంలో రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజిస్తున్నారు.

గతేడాది ఫిబ్రవరి 28వ తేదీన ఉత్తర్వులు

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజకవర్గాన్ని రెండు తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించి పరిపాలన కొనసాగించాలని 2023 ఫిబ్రవరి 28వ తేదీన ప్రభుత్వం జీవోఆర్‌టీ నెంబరు 213ను జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎన్నికల సంఘం దృష్టిలో మచిలీపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలు, ఇద్దరు తహసీల్దార్లు ఉన్నట్టుగా పరిగణనలో ఉంది. రెండు మూడు రోజుల్లో జరిగే తహసీల్దార్ల బదిలీల్లో ఇద్దరు తహసీల్దార్లను మచిలీపట్నం నియోజకవర్గానికి కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘానికి మచిలీపట్నంలో రెండు తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నట్టుగా చూపేందుకు, హడావుడిగా రెండో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

27న తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం


మచిలీపట్నంలోని నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న బందరు కిళ్లీ, సోడా అండ్ బీడీ వర్తకసంఘం భవనంలో ఈనెల 27వ తేదీన రెండవ తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. జిల్లా విభజన సమయంలో తొమ్మిది ప్రభుత్వ శాఖలను ఇక్కడ ఏర్పాటు చేసేందుకు జిల్లాస్థాయి అధికారులు ప్రయత్నించారు. శిథిలావస్థకు చేరిన భవనంలో పని చేయలేమని తేల్చి చెప్పారు. ఈ భవనంలో నూతన తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుతో అధికారుల్లో అలజడి నెలకొంది.

దంపతుల మధ్య చిచ్చురేపి..

గుడివాడలోని వాసవీనగర్‌కు చెందిన కొలుసు రాంబాబు (45) ప్రైవేట్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తనకు ఫోన్‌పే లేకపోవడంతో తనకు వచ్చిన కూలి డబ్బులను భార్య కనకదుర్గకు పంపే ఏర్పాటు చేసుకున్నాడు. ఈనెల 20వ తేదీన డ్యూటీ దిగి మద్యం తాగడానికి రూ.500 తన భార్య సెల్ నుంచి దుకాణంలోని నంబరు పంపమని కోరాడు. తాగి ఇంటికెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం మళ్లీ వెళ్లి ఇంకో రూ.500 అదే నంబరుకు పంపమని కొడుకుని అడిగితే పంపాడు. మళ్లీ మద్యం సేవించి ఇంటికొచ్చాక డబ్బులు తాగుడుకు దుబారా చేస్తున్నావెందుకు అని భార్య అడిగిందని మనస్తాపంతో ఉరేసుకుని చనిపోయాడు. ఆ బాధతో ఆయన భార్య కూడా ఉరేసుకుని అదేరోజు చనిపోయింది. ఒక్కగానొక్క కొడుకు ఒంటరైపోయాడు.

తండ్రిని పోగొట్టుకుని కూలికెళుతున్న మైనర్

మద్యానికి బానిసై జె-బ్రాండ్ మద్యాన్ని సేవించి మల్లాయిపాలేనికి చెందిన దినసరి కూలీ (45) ఇటీవల లివర్ సంబం ధిత వ్యాధితో మృతి చెందాడు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు కావడంతో మైనర్ అయిన కుమారుడు చదువు మానేసి కూలి పనికి వెళుతూ తల్లిని పోషించుకుంటున్నాడు.



పచ్చని కుటుంబాలపై మద్యం కాటు!

రాష్ట్రంలో జె-బ్రాండ్ మద్యం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఈ మద్యంతో వచ్చే ధనదాహంతో ప్రభుత్వం పచ్చని కుటుంబాల్లో చిచ్చులు రేపుతోంది. కొన్నిచోట్ల భార్యాభర్తల ప్రాణాలను బలి తీసుకుంటోంది. ఈ మద్యానికి అలవాటు పడిన వారిలో కొందరు మానసిక రోగులుగా మారుతున్నారు. రహదారుల వెంబడి ఎక్కడపడితే అక్కడ పడిపోయి ప్రాణాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా లివర్, గుండె, నరాల సంబంధిత వ్యాధులపాలై మృత్యువాత పడుతున్నారు.

గుడివాడలో బాధితులు కోకొల్లలు

- గత ఎన్నికల హామీలో మద్యపాన నిషేధం
- అధికారంలోకొచ్చాక ప్రభుత్వం ఆధ్వర్యంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- కాటేస్తున్న జె-బ్రాండ్ మద్యం
- రోడ్డున పడుతున్న పేద కుటుంబాలు
- వరుస సంఘటనలతో ప్రజల బెంబేలు
- మానసిక రోగులుగా కల్తీ మద్యం బాధితులు

గుడివాడ : సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం జాతీయ, రాష్ట్రీయ రహదారుల వెంబడి మద్యం అమ్మకాలను నిషేధించారు. రాష్ట్రంలో మాత్రం ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదు. ఈ మద్యంపై వచ్చే ఆదాయం కోసం ప్రభుత్వం ఏకంగా జాతీయ, రాష్ట్రీయ రహదారులను జిల్లా రహదారులుగా మార్చేసి విచ్చలవిడిగా అమ్మకాలకు తెరలేపింది. వేళగాని వేళ కూడా మద్యం అందుబాటులో ఉండటంతో ఫుల్‌గా మద్యం సేవించి లారీ, ప్రైవేటు బస్సు డ్రైవర్లు అనేక ప్రమాదాలకు కారకులవుతున్నారు. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

మానసిక రోగులవుతున్న మద్యం బాధితులు

నాణ్యతా ప్రమాణాలు లేని జె-బ్రాండ్ కల్తీ మద్యంతో మందుబాబులు మానసిక రోగులుగా మారుతున్నారు. మద్యం తాగకుంటే ఉండలేకపోతున్నారు. బానిసలుగా మారి మానవ సంబంధాలకు సైతం విలువ ఇవ్వడం లేదు. మద్యం తాగేందుకు డబ్బుల కోసం కన్న తల్లిదండ్రులపై దాడులు చేసిన సంఘటనలు కోకొల్లలు. భార్యాభర్తలు గొడవలు పడి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. కల్తీ మద్యంతో సేవించి మతిభ్రమించి రహదారుల వెంబడి పడిపోతున్నారు.

లివర్, గుండె, నరాల రోగాలతో మృతి

జె-బ్రాండ్ మద్యంతో మందుబాబులు అనేక రోగాల బారినపడి మృతి చెందిన సంఘటనలు ఇటీవల నియోజకవర్గంలో పదుల సంఖ్యలో చోటుచేసుకున్నాయి. అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ముఖ్యంగా లివర్, గుండె సంబంధిత వ్యాధులతోనే ఎక్కువగా మరణాలు

- మిగతా 6లో

వేమవరంలో తహసీల్దార్ సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మైనింగ్ మాఫియా తవ్విన పట్టాభూమి పరిశీలన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వేమవరంలో మైనింగ్ మాఫియా అక్రమ తవ్వకాలపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. బాధితుడైన రైతు నాగరాజు పొలాన్ని ఎంతమేర మైనింగ్ మాఫియా తవ్విందో సర్వే చేసేందుకు విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ బుధవారం వెళ్లారు. బాధిత రైతు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా కనికరించని తహసీల్దార్ 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు, టూటౌన్ పోలీసులకు పంపనున్నారు. బాధిత నాగరాజు పొలాన్ని సర్వే చేసే క్రమంలో పలువురు రైతులు వచ్చి తమ భూముల్లో కూడా తవ్వకాలు జరిపారని, సర్వే చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఇప్పుడు తనకు సమయం లేదని చెప్పి ఆమె వెళ్లిపోయారు.

వైసీపీ 90 శాతం ఖాళీ

జిల్లాలో ప్రత్యర్థులు భయపడే మెజారిటీతో గెలవాలి

- పదవులున్నా, లేకున్నా చంద్రబాబుతోనే పయనం
- కేశినేని శివనాథ్ (చిన్ని)

- 6లో..



ప్రధాని మోదీకి ప్రదర్శనను వివరిస్తున్న కృత్తివెంటి శ్రీనివాసరావు

కేంద్ర సాహిత్య అకాడమీ పుస్తక ప్రదర్శనలో మోదీ

- కార్యదర్శి శ్రీనివాసరావుతో ప్రధాని మాటా మంతీ

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిర్వహించిన ప్రదర్శనలో భాగంగా సాహిత్య అకాడమీ నేతాజీపై వివిధ భాషల్లో ప్రచురించిన పుస్తకాలను ప్రదర్శించింది. పుస్తకాలనుంచి 24 ప్యానెల్స్‌ను కూడా అకాడమీ రూపొందించింది. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు ప్రధాని మోదీకి ఈ పుస్తకాలు, ప్యానెల్స్ గురించి వివరించారు. ఎర్రకోట వద్ద నిర్వహించిన ఈ ప్రదర్శన జనవరి 31 వరకు కొనసాగుతుంది. శ్రీనివాసరావు కృష్ణా జిల్లా పెదప్రోలు గ్రామానికి చెందిన వారు కావడం విశేషం.

ఉన్నత స్థితికి చేరేలా.. బాలికల్లో ధృఢ సంకల్పం నింపుదాం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



విద్యార్థినికి జ్ఞాపిక ఇస్తున్న కలెక్టర్

కృష్ణలంక, జనవరి 24 : లింగ వివక్షతను రూపుమాపి బాలికలు ధృడ సంకల్పం, ధైర్యంతో ఆకాశమే హద్దుగా ఉన్నత స్థాయిని చేరేలా ప్రతిఒక్కరూ అండగా నిలవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో బుధవారం బిషప్ అజరయ్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఢిల్లీరావు మాట్లాడుతూ, బాలికల్లో ధృడసంకల్పాన్ని, ధైర్యాన్ని నింపి స్వతంత్రంగా ఉన్నత స్థితికి చేరుకొనేలా ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారుల పాత్ర కీలకమన్నారు. బాలికలు విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు అన్నిరంగాల్లో ముందుండేలా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు కృషి చేద్దామన్నారు. మార్పు ట్రస్ట్ సహకారంతో విద్య, సాంస్కృతిక, క్రీడారంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి, గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, బిషప్ అజరయ్య కళాశాల ప్రిన్సిపల్ సంధ్య, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

కృష్ణలంక, జనవరి 24 : ఎన్నికల విధులపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని, ప్రతి దశలోను అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్వో, ఏఆర్వో, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్ఎంటీ)లకు శిక్షణ కార్యక్రమాన్ని జేసీ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ ఆదితిసింగ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులపై అధికారులు స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవడం ద్వారా బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించవచ్చన్నారు. పోలింగ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ వేదికలు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరళమైన భాషలో అత్యంత నాణ్యమైన శిక్షణను పీవోలు, ఏపీవోలు తదితరులకు అందించాలని ఏఎల్ఎంటీలకు కలెక్టర్ సూచించారు. జేసీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల నిర్వహణకు నిబద్ధత, అవగాహన తప్పనిసరన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ బాలకృష్ణారెడ్డి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు పి.సాయిబాబు, కె.మాధవి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో యూటీఎఫ్ నేతల నిరసన ప్రదర్శన

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మచిలీపట్నం టౌన్ : ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ పోరుబాటలో భాగంగా బుధవారం సాయంత్రం మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోనేరుసెంటర్ వరకు నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉమామహేశ్వరరావుతో పాటు జిల్లా అధ్యక్షుడు సీవీ కనకారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, జిల్లా సహాధ్యక్షురాలు ఝాన్సీ, సీహెచ్. రాజాశ్రీధర్, టీవీ రఘుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లను మోసం చేసిన జగన్

- ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు లీలా మాధవరావు

గవర్నర్‌పేట, జనవరి 24 : వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల సంక్షేమాన్ని పట్టించుకోకుండా మోసం చేసిందని ఏపీ రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు అన్నారు. బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ డీలర్లకు సమాంతరంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను తెచ్చిందని, ఆహార భద్రత చట్టానికి విరుద్ధంగా వారి నియామకం జరిగిందన్నారు. ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి రేషన్ డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సమస్యలను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకువెళ్లి మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరతామన్నారు. తెలంగాణాలో రూ. 5 వేలు గౌరవం వేతనం, కమీషన్ ఇస్తున్నారని, ఏపీలో కూడా గౌరవ వేతనం, కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి పోస్టు ద్వారా పంపుతున్నట్టు వెల్లడించారు.

30న జిల్లా కేంద్రాల్లో సర్పంచ్‌ల రిలే దీక్షలు

మచిలీపట్నం టౌన్ : గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధుల మళ్లింపు, సర్పంచ్‌ల హక్కులపై ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నేతలు, పెదయాదర, చిన్నాపురం సర్పంచ్‌లు గల్లా తిమోతి, కాగిత గోపాలరావు తెలిపారు. బుధవారం మీడియాతో వారు మాట్లాడుతూ, సర్పంచ్‌ల నిధులు, విధుల విషయంలో పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సర్పంచ్‌ల సంఘం మలిదశ ఉద్యమం తీవ్రస్థాయిలో నిర్వహిస్తామన్నారు. సర్పంచ్‌ల 16 రకాల డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని, అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 30వ తేదీన పార్టీలకతీతంగా సర్పంచ్‌లందరూ రిలే దీక్షల్లో పాల్గొంటారన్నారు.

సమైక్యత ఉట్టిపడేలా గణతంత్ర ఏర్పాట్లు

- శాఖల సమన్వయంతో పరేడ్‌కు సిద్ధం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 24 : జాతీయ సమైక్యత ఉట్టిపడే విధంగా గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేసి ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 75వ గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ సమైక్యత ఉట్టిపడేలా వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసి పరేడ్‌కు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పతాకావిష్కరణ చేస్తారని, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనే వేడుకలకు తగిన విధంగా ఏర్పాట్లను సిద్ధంచేసి వేడుకలను వీక్షించేందుకు విచ్చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొనే కంటింజెంట్ విభాగాల ప్రదర్శనలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని చాటేలా వివిధ శాఖల శకటాలను సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా జనరేటర్లను అందుబాటులో వుంచాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో మెడికల్ క్యాంపు, అంబులెన్సులను సిద్ధంగా వుంచాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న వేడుకలను విజయవంతం చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, పోలీసు, రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ 90 శాతం ఖాళీ..

- పదవులున్నా, లేకున్నా బాబుతోనే పయనం
- ప్రత్యర్థులు భయపడేలా విజయం సాధిస్తాం.. : కేశినేని చిన్ని



జగ్గయ్యపేటలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న కేశినేని చిన్ని

జగ్గయ్యపేట, జనవరి 24 : జిల్లాలో 60 శాతం టీడీపీ ఖాళీ చేస్తానన్న వ్యక్తి వైసీపీలోకి వెళ్లాక ఆ పార్టీ 90 శాతం ఖాళీ అయిందని టీడీపీ నేత, కేసినేని శివనాథ్(చిన్ని) అన్నారు. నేడు వైసీపీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ఐక్యంగా ఉండి రాష్ట్రానికి పట్టిన శని వదిలిద్దామని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం జగ్గయ్యపేటలో మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో కేసినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ కుటుంబానికి ఇంత గుర్తింపు వచ్చిందంటే దానికి టీడీపీ, చంద్రబాబే కారణమని, పదవులున్నా.. లేకున్నా జీవితాంతం చంద్రబాబుతోనే పయనిస్తానని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ కోసం చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని, అదే లక్ష్యంగా పనిచేద్దామన్నారు.

జగ్గయ్యపేటలో టీడీపీ గెలుపు ఖాయమైంది..

ఇదేం ఖర్మ కార్యక్రమానికి చంద్రబాబు వచ్చిన రోజునే జగ్గయ్యపేటలో టీడీపీ గెలుపు ఖాయమైందని కేసినేని చిన్ని అన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మెజార్టీని చూసి ప్రత్యర్థులు భయపడి పోవాలన్నారు. జిల్లాలో అన్ని స్థానాల్లో గెలిచి అధినేతకు కానుకగా ఇద్దామన్నారు. జగ్గయ్యపేటలో కేసినేని చిన్నికి మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలుత విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీరాం తాతయ్య శ్రీరాం సుబ్బారావు, రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొనగా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

కేశినేని పౌండేషన్‌తో అండగా నిలిచారు : నెట్టెం

కేసినేని పౌండేషన్‌తో తెలుగుదేశం పార్టీకి కేసినేని చిన్ని అండగా నిలిచారని నెట్టెం రఘురాం ప్రశంసించారు. లక్షలు వెచ్చించి అన్న క్యాంటీన్‌లు, మెడికల్ క్యాంప్ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఎన్టీఆర్ శత జయంతికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పార్టీపై అభిమానాన్ని చాటారన్నారు. జనసేన జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి ఈమని కిశోర్ తదితరులు పాల్గొన్నారు. వత్సవాయి మండలంలో పెదమోదుగపల్లికి చెందిన పలువురు వైసీపీ నేతలు కేసినేని చిన్ని సమక్షంలో పార్టీలో చేరారు.

ఆసరా కాదు.. అక్కా చెల్లెళ్లకు టోకరా : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే కేవలం 79 లక్షల మందికి ఆసరా సాయం చేశాననడం వట్టి దగా అని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ విమర్శించారు. మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డి మహిళలకు వేసింది ఆసరా కాదని, టోకరా అని ఎద్దేవా చేశారు. కల్లబొల్లి కబుర్లతో జగన్‌రెడ్డి మహిళలను నిలువునా ముంచేస్తున్నారన్నారు. జీతాలు పెంచమన్నందుకు అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపి బెదిరించి ఉద్యోగాల్లోకి పంపారన్నారు. మహిళలు దాచుకున్న రూ. 2118 కోట్ల అభయహస్తం నిధులను దారి మళ్లించారన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు చంద్రబాబు సబ్సిడీ పథకాల ద్వారా రూ. 800 కోట్లు ఇస్తే జగన్‌రెడ్డి పథకాలను రద్దు చేశారన్నారు.

తాడేపల్లి సీఎంకు ప్రజల బాధలు తెలియవు : ఉమా

రెడ్డిగూడెం : రాష్ట్రంలో ఉపాధి లేక నిరుద్యోగుల గగ్గోలు.. ఉన్న ఎకరం అమ్ముకొని టీచర్ శిక్షణ పూర్తి చేసిన వారి బాధలు.. పేద, మధ్య తరగతి కుటుంబాల గోష.. తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సీఎం జగన్‌కు అర్థం కావడం లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం రెడ్డిగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పబ్జీ ఆడుకుంటూ, ఎమ్మెల్యేలు, మంత్రుల బదిలీలు చేస్తూ కాలం గడుపుతున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చివేశాడన్నారు. రైతుల ధాన్యం కొనే నాథుడు లేడన్నారు. తెలుగుజాతి కీర్తిని నలుదిశలా వ్యాప్తింప చేసిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముప్పిడి నాగేశ్వర రెడ్డి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలోనే బీఈడీ ప్రశ్నాపత్రాలు

- 3వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణలో ఏఎన్‌యూ నిర్లక్ష్యం
- సోషల్, గణితం, బయాలజీ పేపర్లు ఇంగ్లీషులో ముద్రణ
- వేలాది మంది తెలుగు మీడియం విద్యార్థులతో చెలగాటం

గుంటూరు(విద్య), జనవరి 24: బీఈడీ పరీక్షల నిర్వహణలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్లక్ష్యంతో తెలుగు మీడియం విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. బుధవారం నుంచి ప్రారంభమైన 2022-24 బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో సోషల్, గణితం, బయాలజీ ప్రశ్నాపత్రాలను కేవలం ఇంగ్లీషు మీడియంలోనే ముద్రించి పంపిణీ చేశారు. దీనిపై వర్సిటీ పరిధిలోని 170 కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది తెలుగు మీడియం విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో సెమిస్టర్ వరకు వర్సిటీ అధికారులు రెండు మాధ్యమాల్లో ప్రశ్నాపత్రాలు ముద్రించారు. అయితే మూడో సెమిస్టర్‌లో పేపర్లు కేవలం ఆంగ్లంలోనే వచ్చాయి. అధికారుల నిర్వాకంతో మెథడాలజీ పేపర్‌లో ఇచ్చిన ప్రశ్నలు, పదాలు అర్థంకాక తెలుగు మీడియం విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. గతంలో నాలుగో సెమిస్టర్ ప్రశ్నాపత్రం లీకవడంతో ప్రయోగ పరీక్షలు నిర్వహించకుండానే రూ.లక్షలు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న పీజీ విభాగం అధికారులు మరోసారి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, బీఈడీ పరీక్షల్లో సర్వం తానే అన్నట్లుగా ఓ అధ్యాపకుడు వ్యవహరిస్తున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులోని ఓ కళాశాల అధ్యాపకుడు రెండేళ్లుగా వర్సిటీలోని ఒక అధికారికి అనుంగు అనుచరుడిగా అవతారమెత్తారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు తనిఖీ విధులు కేటాయిస్తానంటూ అధ్యాపకుల నుంచి పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరికి పరిశీలకులుగా(అబ్జర్వర్స్) విధులు కేటాయిస్తానని చెప్పి, కొన్ని కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ భారీగా వసూళ్లు చేశారు.

మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనా రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు మాత్రం ఇంకా విడుదల కాలేదు. గతేడాది అక్టోబరు 26న ఈ పరీక్షలు నిర్వహించగా, నవంబరు 14 నుంచి మూల్యాంకనం ప్రారంభించి, ముగించారు.

అర్జీలకు కొరవడిన స్పందన!

- ఏడాదిగా పరిష్కారం కాని సమస్య.. జనసేన వినూత్న నిరసన

మోపిదేవి, జనవరి 24 : ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో అర్జీలు సమర్పించినా ఏడాదిగా పరిష్కారం కాకపోవటంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో అర్జీ పరిష్కార నిరాకరణ దినోత్సవంగా వేడుకలు నిర్వహించారు. ప్రధాన కూడలి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఏడాది కాలంగా అక్రమ ఇసుక, బుసక, మట్టి తవ్వకాలపై, మోపిదేవి నుంచి రావివారిపాలెం వెళ్లే రహదారిలో ఉన్న ఎస్సీ లే అవుట్‌లో ఆక్రమణలు తొలగించాలంటూ అర్జీలు సమర్పించగా, వాటిపై ఏమి చర్యలు తీసుకున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అర్జీలపై చర్యలు తీసుకోవటంలో అధికారులు ఎందుకు చొరవ చూపటం లేదంటూ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి కార్యాలయ ఆవరణలో అర్జీ వార్షికోత్సవ వేడుకల పేరుతో పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

పైకి నవ్వులు.. లోన కత్తులు!

(5వ పేజీ తరువాయి)

శర్వాణిమూర్తి, లక్ష్మీపతి గైర్హాజరయ్యారు. ఇద్దరు డివిజన్ ఇన్‌చార్జులు కూడా గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. తనకు సహకరించాలని, ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని పేర్కొన్నట్టు తెలిసింది.

జోగికి గ్రూపుల సెగ

పెనమలూరు నియోజకవర్గంలో జోగి రమేశ్‌కు గ్రూపుల సెగ తగులుతోంది. సారథి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఓ వెలుగు వెలిగిన 'హనుమంతు' ఇప్పుడు జోగి రమేశ్ వెనకాల చేరారు. సారథిపై అవినీతి ముద్ర పడటంలో హనుమంతుదే ప్రధాన పాత్ర. తన, మన లేకుండా సారథి హయాంలో ఎడాపెడా వసూళ్లకు తెగబడి, వైసీపీలో మిగిలిన వారందరినీ పక్కకు నెట్టేసి ఆధిపత్యం చెలాయించిన హనుమంతుడు తాజాగా జోగి దగ్గర కూడా అదే తరహా రాజకీయం చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇప్పటికే విసిగిపోయిన వైసీపీ శ్రేణులు మంగళవారం సాక్షాత్తూ మంత్రి జోగి ఎదుటే హనుమంతుపై తిరగబడ్డారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో మంగళవారం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడిగడప మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌ను ఆహ్వానించలేదు. హనుమంతు ఉద్దేశపూర్వకంగానే శ్రావణ్‌ను పిలవలేదంటూ మంత్రి ఎదుటే పోరంకికి చెందిన వైసీపీ నాయకులు హనుమంతును ప్రశ్నించారు. ఈ వివాదం చినికిచినికి గాలివానగా మారి ఇరువర్గాలు బూతులు తిట్టుకునే దాకా వెళ్లింది. దీంతో జోగి అర్ధంతరంగా కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు.

పచ్చని కుటుంబాలపై మద్యం కాటు!

(5వ పేజీ తరువాయి)

చోటుచేసుకుంటున్నాయని వైద్యులు తెలుపుతున్నారు. నరాల బలహీనత వచ్చి కనీసం నడవలేని స్థితిలోకి నెట్టబడుతున్నారు.

● ఈ దారుణాలకు కారకులెవరు?

● ఏడాది క్రితం అత్తారింటికి పండుగకు ముదినేపల్లి మండలం పెదపాలపర్రు వచ్చిన అల్లుడు ప్రభుత్వ మద్యం దుకాణంలో ఫుల్‌గా మద్యం సేవించి గుండె ఆగి ప్రాణాలు విడిచిన సంఘటన గుడివాడ మండలం పాత మల్లాయిపాలెం వద్ద గల బస్టాప్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.

● ఈ నెల 16వ తేదీన కనుమ రోజున జె-బ్రాండ్ మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లి మల్లాయిపాలేనికి చెందిన యువకుడు ఆకస్మిక మృతి చెందిన ఘటన ఆ కుటుంబాన్ని కలవరపాటుకు గురి చేసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తల్లిదండ్రులకు బాసటగా ఉన్న కుమారుడిని కోల్పోవడంతో కన్నీటిపర్యాంతం అవుతున్నారు.

● తల్లిదండ్రులు మద్యానికి బానిసైన యువకునికి వివాహం చేయలేదనే నెపంతో మద్యం మత్తులో యువకుడు పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుడివాడలో సంచలనం రేకెత్తించింది.

● డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఫుల్‌గా మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి ఫైన్ వేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కాకర్ల వీధిలో చోటుచేసుకుంది. దీంతో కుటుంబం రోడ్డున పడి ఆర్థికంగా చితికిపోయారు.

● 25 ఏళ్లు కూడా నిండని యువకుడు మద్యానికి బానిసై గుండెపోటుతో మృతి చెందిన ఘటన పట్టణ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ చేతికందిన కొడుకు మరణం వారిని కలిచివేసింది. తీవ్ర మనస్తాపానికి గురైన తల్లిదండ్రులు కుమారుని జ్ఞాపకాలతో సతమతమవుతూ ఇక్కడ ఉండలేక విజయవాడ వలస వెళ్లిపోయారు. ఇలా వెలుగులోకొ వచ్చిన ఘటనలు కొన్నే. జె-బ్రాండ్ మద్యానికి బానిసలై రోడ్డు కుటుంబాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతూ బతుకీడుస్తున్నాయి. విచ్చలవిడిగా మద్యాన్ని ధారబోస్తున్న ప్రభుత్వం ఈ దారుణాలకు కారణం కాదా? ఇప్పటికైనా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మద్యపాన నిషేధం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదమ్ముల అనుబంధం

- ఇరువురికీ నగరంలో పోస్టింగ్
- చర్చనీయాంశంగా ఎన్టీఆర్‌జిల్లా పోలీసు శాఖలో బదిలీలు

విజయవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : డి.దుర్గాశేఖర్‌రెడ్డి.. డీకేఎస్ మోహన్‌రెడ్డి పేర్లు చూస్తుంటే చాలా దగ్గర సంబంధం ఉన్నట్టు కనిపిస్తాయి. పేర్లలోనే కాదు అనుబంధంలోనూ సంబంధం ఉంది. దుర్గాశేఖర్‌రెడ్డికి తాజాగా జరిగిన బదిలీల్లో వన్‌టౌన్ పోస్టింగ్ ఇచ్చారు. మోహన్‌రెడ్డిని పటమటలో కూర్చోబెట్టారు. దుర్గాశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి సొంత అన్నదమ్ములు. శేఖర్‌రెడ్డి.. మోహన్‌రెడ్డికి పెద్ద అన్నయ్య. ఆయన ఏలూరు రేంజ్ నుంచి పోలీసు కమిషనరేట్‌కు కొద్దిరోజుల క్రితం వచ్చారు. మోహన్‌రెడ్డి మాత్రం కొన్ని సంవత్సరాలుగా పోలీసు కమిషనరేట్‌లోనే పనిచేస్తున్నారు. సొంత అన్నదమ్ములు ఇద్దరికీ విజయవాడలో శాంతిభద్రతల స్టేషన్లు కేటాయించడం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది. మోహన్‌రెడ్డి సర్వీసు దాదాపుగా పోలీసు కమిషనరేట్‌లోనే సాగింది. ఆయన ఇంతకుముందు భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. తర్వాత కొన్నాళ్లు స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి, డీజీపీ కార్యాలయానికి వెళ్లిపోయారు. గడచిన ఏడాది డీజీపీ కార్యాలయం నుంచి తిరిగి కమిషనరేట్‌కు వచ్చారు. ఆయన నేరుగా డీజీపీ కార్యాలయం నుంచి సిఫార్సు చేయించుకుని మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లారు. ప్రస్తుతం అక్కడి నుంచి పటమటకు బదిలీ అయ్యారు. ఆయన సోదరుడు దుర్గాశేఖర్‌రెడ్డి ఏలూరు రేంజ్ నుంచి కమిషనరేట్‌కు కొద్దిరోజుల క్రితం వచ్చారు. సోదరుడికి శాంతిభద్రతల స్టేషన్ ఇస్తున్నందున తనకూ అదేవిధంగా పోస్టింగ్ కావాలని పట్టుబట్టారు. దీనికి కమిషనరేట్ అధికారులు అంగీకరించలేదు. తనకు ఇక శాంతిభద్రతల స్టేషన్ దక్కదని భావించిన దుర్గాశేఖర్‌రెడ్డి సోదరుడు మోహన్‌రెడ్డితో చక్రం తిప్పించారు. ఈ పంచాయితీని నేరుగా డీజీపీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఓ ఉన్నతాధికారి సిఫార్సులతో అన్నదమ్ములు ఇద్దరూ శాంతిభద్రతల స్టేషన్లలో కూర్చోవడానికి సిద్ధమయ్యారు. ఈ విషయం కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

విజయవాడలో ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ ప్రదర్శన

విజయవాడ, జనవరి 24 : దక్షిణ భారతదేశ సంప్రదాయ నగల తయారీ సంస్థ 'ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్' విజయవాడలో నగల ప్రదర్శన ఏర్పాటు చేసింది. లెమన్ ట్రీ ప్రీమియర్‌లోని టాంగెరైన్ హాల్స్ 1, 2లలో బుధవారం ప్రదర్శనను ప్రారంభించారు. గురువారం కూడా ప్రదర్శన కొనసాగుతుందని సంస్థ మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ ఉమ్మిడి తెలిపారు. ఆభరణాల రంగంలో తమ సంస్థకు 123 ఏళ్ల ఘన వారసత్వం ఉందని చెప్పారు. ప్రత్యేకంగా రూపొందించిన బంగారు ఆభరణాలు, శోభాయమానమైన వెండి వస్తువులు, అందరి దృష్టినీ ఆకర్షించే ట్రెండీ జ్యువెలరీ ఈ ప్రదర్శనలో ఉంచినట్టు వివరించారు. ఆభరణాలను చెన్నైలోని తమ క్రియేటివ్ సెంటర్‌లో ప్రత్యేక డిజైన్లలో, ప్రత్యేక శ్రద్ధ, సాంప్రదాయక మెళకువలు, గరిష్ఠ ప్రామాణికత, అత్యధిక నాణ్యతతో తీర్చిదిద్దినట్టు తెలిపారు. లక్ష్మీ హారాలు, నెమలి హారాలు సహా వైవిధ్యభరితమైన వివాహ ఆభరణాలు, పెళ్లికూతురి కోసం వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలను శోభాయమానంగా, అత్యాధునికంగా తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. విభిన్న మోడళ్లలో రూపొందించిన నక్లెస్‌లు, చెవి రింగులు, దుద్దులు, ముక్కు పుడకల ప్రత్యేకతలను సందర్శకులకు తమ సిబ్బంది వివరిస్తారని తెలిపారు.

టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కమిటీలో సభ్యుల నియామకం

మచిలీపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్రకమిటీలో కృష్ణాజిల్లాకు చెందిన ఇద్దరికి స్థానం కల్పిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కర్రా సుధాకర్‌ను అఫిషియల్ స్పోక్స్ పర్సన్‌గా, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఊసా వెంకటేశ్వరరావును ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు.

మార్చి 9న లోక్‌అదాలత్

మచిలీపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, రాజీ పడదగిన అన్ని రకాల కేసులను ఈ కార్యక్రమంలో పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు, న్యాయవాదులు సహకరించి లోక్‌అదాలత్‌లో అధికంగా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆమె సూచించారు.

పామర్రు కాంగ్రెస్ టికెట్‌కు డీవై దాస్ దరఖాస్తు

పామర్రు, జనవరి 24 : పామర్రు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీనుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అవకాశం కల్పించాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవైదాస్ నేతలకు దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఏపీ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మాణిక్యంఠాగూర్, కేవీపీ రామచంద్రరావులకు దరఖాస్తును అందజేశారు. ఈసందర్భంగా విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ, పామర్రు ప్రజల అభీష్టం మేరకు తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానన్నారు.

ఆరు బయటే అంగన్వాడీలు!

- కానరాని సచివాలయ సిబ్బంది

కోడూరు, జనవరి 24 : అంగన్వాడీలను విధులకు హాజరుకావాలని మంగళవారం సాయంత్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ అంగన్వాడీల కేంద్రాల తాళాలు పగలకొట్టి బాధ్యతలు చేపట్టిన సచివాలయ సిబ్బంది బుధవారం ఉదయం 11 గంటలైనా స్కూలు తెరిచేందుకు తాళాలు ఇవ్వకపోవటంతో కోడూరు మండలంలో పలు సెంటర్ల వద్ద అంగన్వాడీ టీచర్లు పిల్లల్ని కూర్చొబెట్టి కాపలా కాశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించలేక కొన్ని సెంటర్లలో పిల్లలను ఇంటికి పంపించివేశారు. అధికారుల తీరుపై అంగన్వాడీలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

సరిహద్దు రాయి మార్పుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయవాడ రూరల్, జనవరి 24 : అంబాపురం పాముల కాలువ వద్ద గ్రామాల సరిహద్దు రాయి జరపడంపై అంబాపురం, జక్కంపూడి, పి. నైనవరం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ ఎస్ దిల్లీరావుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. అంబాపురం పాముల కాలువ వద్ద గతంలో సరిహద్దు రాయి ఉండేదని జగనన్న భూ రక్ష సర్వే పేరుతో అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య స్వలాభం కోసం సరిహద్దు రాయిని మార్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ సరిహద్దుల్లో ప్రెసిడెంట్ ఆరు సెంట్ల పోరంబోకు భూమిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని సదరు నిర్మాణం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చి సరిహద్దును చెరిపివేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

బ్యానర్ తొలగింపుపై పాస్టర్ల ఫిర్యాదు



ఎస్సైకు ఫిర్యాదు అందజేస్తున్న పాస్టర్లు

హనుమాన్‌జంక్షన్, జనవరి 24 : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జంక్షన్ క్రిస్టియన్ ఫెలోషిప్ పాస్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన సువార్త మీటింగ్‌కు సంబంధించిన బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారని వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో పాస్టర్లు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్లుగా జంక్షన్‌లో ఎవరికి ఇబ్బంది కలగకుండా బ్యానర్ ఏర్పాటు చేస్తున్నామని, గుర్తుతెలియని వ్యక్తులు తొలగించడం అన్యాయమని పేర్కొంటూ ఎస్సై జనార్దన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు గంటా రత్నభూషణం, రెడ్డి రవిస్టాలిన్, శుభాకర్, రత్నబాబు, పేతురు, మురళీ జేమ్స్, జోజి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



సరుకులు అందిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్, జనవరి 24: స్థానిక ఆదిత్య బధిర, ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలకు మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో ఆరుగొలనుకు చెందిన వీరం జ్ఞానేశ్వరరావు తన భార్య సత్య ప్రసన్న జ్ఞాపకార్థం నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలు, రూ.2200లు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు ఆకుల వెంకటరమణ, మరీదు వెంకటస్వామి, మానవత సభ్యులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, జాన్యావుల సత్యనారాయణ, చెక్కా సుబ్బారావు, దయాల ప్రభాకర్, ఇందిరాదేవి తదితరులు పాల్గొని దాతను అభినందించారు.

గోవా మద్యం సీసాలు పట్టివేత

ఉంగుటూరు, జనవరి 24 : చెన్నై-కోల్‌కతా 16వ నెంబర్ జాతీయ రహదారిపై పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద కారులో తరలిస్తున్న గోవా మద్యం సీసాలను బుధవారం ఆత్కూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హనుమాన్‌జంక్షన్ సీఐ ఏ.నవీన్‌నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సీఐ నేతృత్వంలో ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్, సిబ్బందితో కలిసి పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రాజమండ్రికి చెందిన ప్రసాద్‌వర్మ, సాయి, నవీన్‌వర్మ, గణేష్ కుమార్ అనే నలుగురు యువకులు హైదరాబాద్, రాజమండ్రి ప్రాంతాల్లో వివిధ వృత్తులు చేసుకుంటూ అప్పుడప్పుడు ఎంజాయ్‌మెంట్ ట్రిప్ వేస్తుంటారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి గోవా వెళ్లిన యువకులు అక్కడ రూ.17, 444లు విలువగల 8మద్యం ఫుల్‌బాటిళ్లను కొనుగోలుచేసి రాజమండ్రి వైపు వెళ్తున్నారు. పొట్టిపాడు వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో మద్యం బాటిళ్లతో సహా వీరు పట్టుబడ్డారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

200 మందికి వైద్యపరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెనమలూరు, జనవరి 24 : టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ కుమార్తె రవళి చౌదరి జన్మదినం సందర్భంగా యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్‌లో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష ఆదరణ లభించింది. కామినేని ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో రెండు వందల మంది వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాజీల్ గురుస్వామి, సయ్యద్ షాహీనా, పండల రజిని, బలగం కొండ పాల్గొన్నారు.

కర్పూరీ ఠాకూర్

సేవలు చిరస్మరణీయం



ఠాకూర్ చిత్రపటం వద్ద ప్రజా సంఘాల నేతల నివాళి

హనుమాన్‌జంక్షన్, జనవరి 24 : బిహార్ తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా విశిష్ట సేవలు అందించిన దివంగత నేత కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం సముచితమని బీసీ సంఘాల నాయకులు హర్షం వెలిబుచ్చారు. కర్పూరీ ఠాకూర్ శత జయంతి సందర్భంగా స్థానిక విజయవాడ రోడ్డులో బీసీ సంఘాలు, న్యాయీ బ్రాహ్మణ, సామాజిక ప్రజా చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఠాకూర్ చిత్రపటా నికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకు లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు మట్టా వరసాయి ప్రసాద్, కొల్లిపర వరప్రసాద్, నలగాము రాజు, వెంకట రామారావు, చలపతిరావు పాల్గొన్నారు.

నున్న సీఐగా దుర్గాప్రసాద్

పాయకాపురం : నున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐగా ఎస్. దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్‌కు వచ్చి విధులకు హాజరైన నూతన సీఐ సిబ్బందితో మాట్లాడి స్టేషన్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఏలూరు రేంజ్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై నున్న పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు



యార్లగడ్డకు ఆత్కూరులో పూర్ణకలశంతో స్వాగతం పలుకుతున్న అర్చకస్వాములు

ఉంగుటూరు, జనవరి 24 : ప్రజల కోసం పోరాడుతున్న తెలుగుదేశం పార్టీ అధినేత, నారా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రభవిష్యత్తుతోపాటు భావితరాల భవిష్యత్తుకు గ్యారెంటీ వుంటుందని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని పొట్టిపాడు, నారయ్యఅప్పారావుపేట, ఆత్కూరు గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పొట్టిపాడులో మహిళలు యార్లగడ్డ నుదుటిన తిలకం దిద్ది, హారతులతో నీరాజనాలివ్వగా, ఆత్కూరులో అర్చకస్వాములు పూర్ణకలశంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయ న పార్టీనేతలతో కలిసి ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, మూల్పూరి సాయికళ్యాణి, మేడిపల్లి రమాదేవి, పరుచూరి నరేష్, తాటిపాముల నాగయ్య, మండవ రమ్య, ఈసరి రవికుమార్, కర్నాటి మణికంఠ, అట్లూరి రామ్‌కిరణ్, యార్లగడ్డ విద్యాసాగర్, కొండేటి వెంకటేశ్వరరావు, పకీర్, గుండపనేని నాని, అట్లూరి జోషీమధు, కోనేరు రాము, పామర్తి వెంకటేశ్వరరావు, లంకా నాని, పలగర సాంబశివరావు, కడి యాల శ్రీనివాసరావు, వేమారెడ్డి శ్రీనివాసరావు, తమ్మారెడ్డి సుధాకర్, తాతినేని సృజన్ పాల్గొన్నారు.

పలువురు యువకులు టీడీపీలో చేరిక

పొట్టిపాడుకు చెందిన పలువురు యువకులు యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో టీడీపీ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో కాండ్రు రూబేను, గుడ్డేటి రాజు, యలమర్తి అఖిల్, కాండ్రు జానేషు, ఆదియ్య, శివశంకర్, శ్రీనివాస్, స్వామి, కృష్ణ, దుర్గ వరప్రసాద్ ఉన్నారు.

● పొట్టిపాడుకు చెందిన గుడ్డేటి రాణికి చెందిన ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. నిరాశ్రయులైనరాణి కుటుంబానికి యార్లగడ్డ వెంకట్రావు రూ. 15వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

అందుబాటులో ఉండే నాయకుడిని గెలిపించండి

మారేడుమాక (కంకిపాడు) : అధికారం ఉన్నా.. లేకున్నా అందరికీ అందుబాటులో ఉండే నాయ కుడు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అని ఆయన్నే ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కుమారుడు బోడె వెంకట్ రామ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని మారేడుమాకలో బుధవారం బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్ రామ్ మాట్లాడుతూ, నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు బోడె ప్రసాద్ అని, ప్రస్తుత ఎమ్మెల్యే ఎక్కడ ఉంటారో తెలియక ప్రజలు నాలుగేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం నియోజకవర్గ సమన్వయ కర్తగా నాన్‌లోకల్ అభ్యర్థిని అధికా రపార్టీ ప్రకటించిందని, ఆయన ఎక్కడ ఉంటారో ప్రజలకు తెలియదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, ఊసల రామయ్య, సూరపనేని మురళి, వీర్ల వీరయ్య, కనగాల వీరరాజు, సోడవరపు సురేష్, సూరపనేని గంగాధర్‌రావు, అక్కినేని గంగాధర్‌రావు, అక్కినేని రాజశేఖర్, ముసునూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మారేడుమాకలో సమస్యలు తెలుసుకుంటున్న బోడె వెంకట్ రామ్, సుదిమళ్ల తదితరులు

ఒక్కచాన్స్ పేరుతో రాష్ట్రం నాశనం

● మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 24 : ఒక్కచాన్స్ ఇవ్వమని ప్రజలను బతిమలాడిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక, అవినీతి పాలనతో రాష్ట్రాన్ని అన్నివిధాల నాశనం చేశాడని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆరోపించారు. ఉయ్యూరు 15వ వార్డులో బుధవారం బాబూ ష్యూరిటీ- భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్నాధరావు, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ నాయకులు వాసు, చిరంజీవి, నాగరాజు, అప్పలనాయుడు,జనసేన నాయకులు మహాలక్ష్మి, వినయ్ ,కౌన్సిలర్లు సుధారాణి, సలోమి పాల్గొన్నారు.

● ఆకునూరులో పార్టీ నాయకులతో కలసి బోడే హేమ పర్యటించి చంద్ర బాబునాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలసిన అవసరాన్ని ప్రజలకు తెలియజేసి, టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, లిఖిత పాల్గొన్నారు.



ఉయ్యూరు 15వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పెనమలూరు : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం యనమలకుదురు 51, 58 బూత్‌లలో నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. శేఖర్, శివరాం, సుబ్బు, కొండ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 24 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అయోధ్యనగర్ ప్రాంతానికి చెందిన ఘనిశెట్టి సునీత ఇంట్లో చీరల వ్యాపారం చేస్తుంటుంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పరిచయస్తుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చింది. ఇంటికి వేసిన తాళం పగులకొట్టడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో తన ఇంట్లో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూ. 10 వేలు నగదు, ఏడు గ్రాముల బంగారు ఆభరణాలు, పావుకిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు ,కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు వివరిస్తున్న సీఐ వెంకటలక్ష్మి

ఉయ్యూరు. జనవరి 24 : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, అలవాటుపడితే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉయ్యూరు సీఐ జి వెంకటలక్ష్మి అన్నారు. శ్రీశ్రీనివాస కళాశాలలో విద్యార్థులకు బుధవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనతరం 60 మంది విద్యార్థులతో యాంటీ డ్రగ్ డిక్లరేషన్ ఫారాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుర్గాప్రసాదరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాడుల సంస్కృతి మానుకోవాలి

రంగబాబుపై దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో టీడీపీ నాయకులు

గన్నవరం, జనవరి 24 : వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడి దాడులకు తెగబడుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ నాయకుడు కాసన్నేని రంగబాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం వద్ద నుంచి టీడీపీ శ్రేణులు బుధవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జాస్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వెనుక నుంచి దాడులు చేయటం పిరికి పంద చర్య అన్నారు. పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవటం వల్లే దాడులు పెరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలు లేవని చెప్పడానికి ఒక ఘటన మరువక ముందే మరొకటి జరగటమేనన్నారు. ఇలాంటి సంస్కృతి ఎన్నడూ లేదన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో టీడీపీ నాయకులపై దాడులు పెరిగాయన్నారు. రంగబాబుపై దాడి చేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారం ఉన్నా దుండగులను పోలీసులు పట్టుకో లేకపోయారని, దర్యాప్తును వేగవంతం చేయటంతో పాటు నిజాయితీగా వ్యవహరించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీలు పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరరరావు, ఉప సర్పంచ్ పాలడుగు నాని, టీడీపీ నాయకులు జూపల్లి సురేష్, మండవ లక్ష్మి, దేవినేని సులోచన, మేడేపల్లి రమ, మండవ రమ్యకృష్ణ, యనమదల సతీష్, బుస్సే నాగ ప్రసాద్, కాట్రగడ్డ అరుణకుమారి, తుల్లిమిల్లి ఝాన్సీ లక్ష్మీ, బడుగు ఝాన్సీ, షేక్ రఫీ, జాస్తి ఫణి శేఖర్, శివాజీ, శ్రీనివాసరావు, విజయరావు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సారూ.. గోనెసంచులు ఇప్పించరూ..

● కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు



ఉంగుటూరు ఆర్బీకేలో రైతుల సమస్యలు వింటున్న సివిల్ సప్లై అధికారిణి బి.సృజన

ఉంగుటూరు, జనవరి 24: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత 15 రోజులుగా గోనెసంచులు లేక, కళ్లాల్లోని ధాన్యానికి కాపలా కాయలేక నానా అవస్థలు పడుతున్నామని రైతులు, కౌలురైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎలుకపాడుకు చెందిన కౌలు రైతు అజ్మీర్ వెంకటేశ్వరరావు తాను కుప్పనూర్చి 15 రోజులవుతున్నా గోనెసంచులు లేక కళ్లాల్లోని ధాన్యాన్ని రేయింబవళ్లు కాపలాకాస్తూ అనారోగ్యం బారినపడ్డానని, ఇప్పటికైనా గోనేసంచులు ఇప్పించి పుణ్యం కట్టుకోండి మహాప్రభో అంటూ తన సమస్యను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ వెంటనే సివిల్ సప్లై అధికారులను క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాలని ఆదేశించారు. దీంతో సాయంత్రం ఉంగుటూరు ఆర్బీకేకు వచ్చిన సివిల్‌సప్లై అసిస్టెంట్ మేనేజర్(అకౌంట్స్)బి.సృజన ఫిర్యాదు చేసిన అజ్మీర్ వెంకటేశ్వరరావుతోపాటు మరికొందరు రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గోనెసంచులు కొరతవల్ల 15 రోజులుగా ధాన్యం కల్లాల్లోనే వుండిపోయిందని, స్థానిక అధికారులను అడిగితే గోనెసంచులు అందుబాటులో లేవని చెబుతున్నారని రైతులు అధికారిణికి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పి.రాము, జి.నాగరాజు, వెంకటేశ్వరరావు, సంతోష్, వీఆర్వో మూర్తి, వీఏప సూర్యనారాయణ, రాఘవయ్య పాల్గొన్నారు.

అద్భుత బాలయేసు

పోస్టర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 24 : అద్భుత బాలయేసు మహోత్సవాల సందర్భంగా జనవరి 31వతేదీ నుంచి నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల పోస్టర్‌ను ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి బుధవారం పెరికీడులో ఆవిష్కరించారు. బాలయేసు మహోత్సవాల్లో బైబిల్ వాక్య పరిచర్య, ఉజ్జీవ స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ జరుగుతాయని పారిస్ కౌన్సిల్ అధ్యక్షుడు గుడిసె రాజు వివరించారు. సిస్టర్ సుపీరియర్ ఆంథోనమ్మ, సిస్టర్ మంజు కనక వల్లి, ఫ్రాన్సిస్, రాము, సింగ వరపు సల్మాన్ రాజు, పొట్ల సురేష్, రవి కుమార్ పాల్గొన్నారు.

ఆధారాలు లేని నగదు స్వాధీనం

గన్నవరం, జనవరి 24: ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చిన అవుటపల్లి సమీపంలో హనుమాన్ జంక్షన్ సీఐ నవీన్ నరసింహ మూర్తి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళుతున్న కారులో ఆధారాలు లేని రూ.10 లక్షలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

రేపు గాంధీక్షేత్రంలో విద్యార్థులకు పోటీలు

అవనిగడ్డ, జనవరి 24: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీక్షేత్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు దివిసీమ లలిత కళాసమితి, గ్రామీణ యువజన వికాససమితి ఆధ్వర్యంలో పాతికేళ్లలోపు విద్యార్థులు, యువకులకు పాటల పోటీలు, పదేళ్లలోపు బాలబాలికలకు దేశభక్తుల వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు గాంధీక్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, లలిత కళా సమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 99494 17719కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

మచిలీపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం జడ్పీ కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తామని ఆర్డీవో ఎం.వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ, నూతన, సీనియర్ ఓటర్లు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉత్తర, దక్షిణ మండలాల్లోని ప్రాంతాలివే

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం నియోజకవర్గాన్ని ఉత్తర, దక్షిణ మండలాలుగా విభజించనున్నారు.

ఉత్తర మండలం పరిధిలో..

ఉత్తర మండలం పరిధిలోకి వచ్చే డివిజన్లు, గ్రామాల వివరాలు ఇలా ఉన్నాయి. పెదపట్నం, కానూరు, తాళ్లపాలెం, గోకవరం, మంగినపూడి, బుద్దాలపాలెం, తపసిపూడి, కొత్తపూడి, పొట్లపాలెం, బొర్రపోతుపాలెం, పోతేపల్లి, గోపువానిపాలెం, అరిసేపల్లి, హుస్సేన్‌పాలెం, కరగ్రహారం, మాచవరం, చిలకలపూడి. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1 నుంచి 19 డివిజన్లు, 40 నుంచి 50 డివిజన్లు ఉత్తర మండలం పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతాలన్నీ ప్రస్తుతం కొనసాగుతున్న పాత తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ఉంటాయి.

దక్షిణ మండలంలో..

ఎస్ఎన్ గొల్లపాలెం, గుండుపాలెం, రుద్రవరం, కోన, పోలాటితిప్ప, చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, పెదయాదర, నెలకుర్రు, పల్లెతుమ్మలపాలెం, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20 నుంచి 39 డివిజన్లు. ఈప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా కాలేఖాన్‌పేట, లేదా చిన్నాపురంలో అద్దెభవనంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. అలా కాకుండా నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న బందరు కిళ్లీ, సోడా అండ్ బీడీ వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. నూతన తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ఎన్నికలసంఘం నిబంధనల మేరకు తహసీల్దార్ వేరే జిల్లా నుంచి వస్తారు. నూతన కార్యాలయంలో సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని ఇంతవరకు కేటాయించలేదు. ఒకే ఒక్క సర్వేయరును నూతన తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటివరకు నియమించారు. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఉద్యోగుల మధ్య విభేదాల కారణంగా ఒక అటెండరు బదిలీ కోరుకుంటే అతనిని నూతన తహసీల్దార్ కార్యాలయానికి పంపుతామని మౌఖికంగా చెప్పినట్లు సమాచారం.

ఓటర్ల జాబితాల్లో మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



టీడీపీ శ్రేణులకు సూచనలిస్తున్న మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జనవరి 24: ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ శ్రేణులకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం అవనిగడ్డ నియోజకవర్గస్థాయి పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాల్లో పేర్లు గల్లంతవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో కుటుంబ సాధికారిత సారథులుగా పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు బూత్ స్థాయిలో జాబితాల్లో అవకతవకలను పరిశీలించి ఓటర్లను చైతన్యవంతులను చేయాలన్నారు. అర్హుల ఓట్లు తొలగించేందుకు ప్రభుత్వం గానీ, వలంటీర్లు గానీ ప్రయత్నించినా పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. రాబోయే టీడీపీ- జనసేన ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, గ్రామాల్లో ఓటర్లకు ఆ భరోసా కల్పించాలని సూచించారు. మండలి వెంకట్రామ్, యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర పరిశీలకులు గుమ్మడి విద్యా సాగర్, చిట్టూరి యువరాజు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన

గుడ్లవల్లేరు, జనవరి 24: విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సును బుధవారం వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో లియో గ్లోబెల్ ఓవర్సీస్ సంస్థ నిర్వహించింది. ఐర్లాండ్ దేశానికి చెందిన ఫార్మా రంగ ప్రతినిధులు డేవిడ్, మేరీల ఐర్లాండ్ దేశంలో ఫార్మసీ కళాశాలలు, వీసా విధానాలు, అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, వసతి సౌకర్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అక్కడ ఉన్న ఫార్మసీ జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు, అందులో అవకాశాలు, జీతభత్యాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ప్రతినిధి వి.ఎల్ వినోద్‌కుమార్, అధ్యాపకులు ఎస్కే అమీనాబీ, టి.ప్రశాంతి, బి.మోహన్ గాంధీ, టి.బాలకృష్ణ, కె.పరిమళ పాల్గొన్నారు.

ఆసరా కాదు అక్కచెల్లమ్మలకు టోకరా

• టీడీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను, జనవరి 24: ఆసరా పేరుతో జగన్ కల్లబొల్లి మాటలు చెప్పి, మహిళలను మోసం చేస్తున్నారని టీడీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీతం పెంచమని సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై కక్ష కట్టి ఉక్కుపాదం మోపిన జగన్‌రెడ్డి ఆసరా పేరుతో మహిళలను ఉద్ధరిస్తాననడం సిగ్గుమాలిన చర్య అన్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షల మందికే ఆసరా అందించటం మోసం కాదా అని ప్రశ్నించారు. వృద్ధ మహిళలు దాచుకున్న 2 వేల 118 కోట్లు దారి మళ్లించటమేనా వారిని ఉద్ధరించటమంటే అని ఆయన ప్రశ్నించారు.

సున్నా వడ్డీ పరిమితిని కుదించడం మోసం కాదా?: వెంకట్రామ్

అవనిగడ్డ: "చంద్రబాబు హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ రూ.5 లక్షల వరకు వర్తింపజేశారు. అధికారంలోకి వస్తే రూ.10 లక్షలకు పెంచుతానని జగన్ నమ్మించారు. తీరా అధికారంలోకి వచ్చాక టీడీపీ అమలు చేసిన రూ.5 లక్షల పరిమితిని రూ.3 లక్షలకు కుదించారు. ఇది మోసం కాదా?" అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ప్రశ్నించారు. బుధవారం అవనిగడ్డలో ఆయన మీడియాతో మాట్లాడారు.

బందరులో వైసీపీ అడ్రస్ గల్లంతవుతుంది




పిల్లంగొల్లపాలెంలో మాట్లాడుతున్న జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జి బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జనవరి 24: అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వంపై మచిలీపట్నం నియోజకవర్గ ప్రజలు విముఖత చూపిస్తున్నారని, జనసేన-టీడీపీ కూటమి అభ్యర్థి గెలుపు తథ్యమని జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. బుధవారం బందరు మండలం పిల్లంగొల్లపాలెంలో జనసేన-టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ శ్రేణులు ఐక్యతంగా పని చేయాలని సూచించారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, స్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి అందిస్తామని తెలిపారు. అమ్మిరెడ్డి శేషారత్నానికి హోటల్ నిర్వహణకు రూ.15వేలు సాయం అందించారు. గ్రామంలో రామాలయం నిర్మాణానికి సిమెంటును అందించారు. కె.పి.రామస్వామి, మట్టా సూరి బాబు, గడ్డం రాజు, మట్టా చింతయ్య, చండిక దినేష్ పాల్గొన్నారు. పోతేపల్లికి చెందిన తణుకుల శ్రీదేవికి మధుమేహం కారణంగా కాలు తీసేశారు. ఆమెకు బండి రామకృష్ణ ఆర్థిక సాయం అందించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన దొండపాటి వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ రెండు కుటుంబాలకు రూ.15 వేలందించారు.

250 మందికి దుప్పట్ల పంపిణీ

కోడూరు, జనవరి 24: ఉల్లిపాలెం యానాదుల కాలనీ, ఇతర ప్రాంతాల్లోని 250 మంది యానాదులకు రూ.30 వేల విలువైన దుప్పట్లను జనసేన నాయకుడు మాదివాడ వెంకటకృష్ణ బుధవారం పంపిణీ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య, టీడీపీ, జనసేన నాయకులు కొండవీటి సునీత, వెంకటేశ్వరరావు, లంకే భాస్కరరావు, పెద్ది భాస్కరరావు, బడే వీరబాబు, పరిశె నాగమల్లేశ్వరరావు, కాగిత రామారావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, బడే రాజశేఖర్, పూషడపు భాను, కంచర్లపల్లి వెంకట రమణ, గళ్ల శేషాద్రి పాల్గొన్నారు.



అవనిగడ్డ లంకమ్మ మాన్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండలి వెంకట్రామ్

రాష్ట్రాభివృద్ధి

బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

అవనిగడ్డ, జనవరి 24: టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందని, రైతులకు అన్నదాత సుఖీభవ, యువగళం నిధి, ఇంటింటికీ మంచినీరు, బీసీ రక్షణ చట్టం, మహాశక్తి పథకాలు కూటమి అధికారంలోకి రాగానే అమలవుతాయని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం అవనిగడ్డ శివారు లంకమ్మ మాన్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, అడపా శ్రీను, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఘంటసాల రాజమోహనరావు, బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహనరావు, యాసం లంకమ్మ, విశ్వనాథపల్లి పాప పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న వర్ల కుమార్‌రాజా

కూచిపూడి: బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా తెలిపారు. బుధవారం కాజలో నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడారు. బీసీల హక్కులను వైసీపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. టీడీపీ అంటే బీసీలని, బీసీలంటే టీడీపీ అన్నంతగా పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి అండగా నిలిచారన్నారు. చంద్రబాబును అధికారంలోకి తెచ్చేందుకు బీసీలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య), పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి గురుమూర్తి, కోట వీర బాబు, వీరంకి పరశురామ్, తాతా నారాయణరావు, బత్తిన దాసు, వీర్ల నరేష్, వీరంకి తులసీదాసు పాల్గొన్నారు.



గుడివాడలో పార్టీ కండువాలు కప్పి వైసీపీ నుంచి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల రాము

టీడీపీలో 50 మంది చేరిక

గుడివాడ: త్వరలోనే వైసీపీ ఖాళీ అవుతుందని, రానున్న రోజుల్లో టీడీపీలో చేరేందుకు మరింత మంది సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము తెలిపారు. 8వ వార్డుకు చెందిన శీలం తాతారావు, అప్పారావు, వెంపల శ్రీనివాసరావు నేతృత్వంలో వైసీపీకి చెందిన 50 మంది బీసీ సంఘీయులు బుధవారం వెనిగండ్ల సమక్షంలో పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నైజాంపేటలో మాజీ కౌన్సిలర్ షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాజా గరీబ్ నవాజ్ జెండా ఊరేగింపు వేడుకల్లో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావుతో కలిసి వెనిగండ్ల రాము పాల్గొన్నారు. జెండాల చెట్టు మందిరంలో మతపెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు.

వెనిగండ్ల ఆధ్వర్యంలో..

గుడివాడ: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో 8, 10వ వార్డుల్లో బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాలు నిర్వహించారు. వార్డు సమస్యలను వెనిగండ్ల ఎదుట ప్రజలు ఏకరువు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, షేక్ అజీమున్నీసా, ఆర్నేపల్లి పాండు, షేక్ సర్కార్, జానీ షరీఫ్, వడ్డాది నాగరాజు, చుక్కా శేషుబాబు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే సూపర్ సిక్స్ పథకాలు: కుమార్‌రాజా

పామర్రు: పేదల సంక్షేమం కోసమే టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని ఆపార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా అన్నారు. పామర్రు 18వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాలిపర్తి ప్రసాద్, సందీప్, పామర్తి వెంకయ్య, మంతెన రామాంజనేయులు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, పొనుగంటి సందీప్, సుబ్రహ్మణ్యం, రవి పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: నారాయణరావునగర్ కాలనీలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ మండల నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్ర బాబు గతంలో ప్రకటించిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు. మోర్ల రాంబాబు, మోర్ల శివ, షేక్ నబీషోరి, పఠాన్ జిలానీ, అనగాని రామకృష్ణ, పైడిపాముల స్వప్న, బోలెం నాగమణి, బావిశెట్టి కనకదుర్గ, అనగాని నాగేశ్వరరావు, జాబీర్, మేడికొండ రవిబాబు పాల్గొన్నారు.

పరిటాల రవికి ఘన నివాళి

గుడివాడ: పరిటాల రవి వర్ధంతిని బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పరిటాల చిత్రపటానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ నివాళులర్పించారు.

హుండీ ఆదాయం రూ.9.28లక్షలు

గుడివాడ: పాటిమీద వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలను లెక్కించగా ఆదాయం రూ.9,28,158 సమకూరిందని ఈవో నటరాజన్ షణ్ముగం తెలిపారు.

కర్పూరి ఠాగూర్‌కు బందరుతో అనుబంధం



మచిలీపట్నం సభలో కర్పూరి ఠాగూర్‌తో కొనకళ్ల గణపతి, కొనకళ్ల నారాయణ, బొర్రా నటేష్(ఫైల్)

మచిలీపట్నం టౌన్, జనవరి 24: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కర్పూరి ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య, బొర్రా నటేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. తన తండ్రి కొనకళ్ల గణపతితో కర్పూరి ఠాగూర్‌కు అవినాభావ సంబంధం ఉందని కొనకళ్ల నారాయణ తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి జరిపిన ఉద్యమాల్లో కర్పూరి ఠాగూర్‌తో కలిసి ఆయన పనిచేశారన్నారు. కర్పూరి ఠాగూర్ సీఎంగా పనిచేసిన సమయంలో 1971లో మచిలీపట్నం లేడీస్ క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సదస్సు నిర్వహించారని, ఠాగూర్‌తో పాటు దివంగత గౌతు లచ్చన్న ఉపన్యసించారన్నారు. నితీష్‌కుమార్, లాలూప్రసాద్ యాదవ్ వంటి ప్రముఖులకు కర్పూరి ఠాగూర్ గురువన్నారు. 1990లో మండల కమిషన్ ఏర్పాటుకు ఆయన కృషి మరువలేనిదన్నారు.

అంగన్వాడీల ఉద్యమం విజయవంతం

• సంఘం నాయకులు రమాదేవి, రెజీనారాణి

మచిలీపట్నం టౌన్, జనవరి 24: జీతాలు, సర్వీసు కొనసాగింపు సమస్యలపై అంగన్వాడీలు చేసిన ఉద్యమం విజయవంతమైందని అంగన్వాడీ కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, మచిలీపట్నం ప్రాజెక్టు సంఘ కార్యదర్శి రెజీనారాణి అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 41 రోజుల పాటు నిర్వహించిన సుదీర్ఘ ఉద్యమం ఫలితంగా సీఐటీయూ డిమాండ్లు కొంతవరకు నెరవేరాయని, మిగిలినవి ఆమోదానికి అగ్రనాయకులు చర్చలు జరుపుతారన్నారు.

డైరీ ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్, జనవరి 24: రాష్ట్ర టైపిస్ట్స్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ డైరీని బుధవారం కృష్ణాజిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బసు, డీఆర్డీయే పీడీ ప్రసాద్ ఆవిష్కరించారు. రాష్ట్ర టైపిస్ట్స్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలుసు ఏసుబాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా సంఘ అధ్యక్షుడు వి.వి.ఎస్.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

కులగణన సర్వే వేగంగా నిర్వహించండి

మోపిదేవి, జనవరి 24: కులగణన సర్వేను వేగంగా, సక్రమంగా నిర్వహించాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో కె.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పెదప్రోలు, వెంకటాపురం, మోపిదేవి గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి కె.రామకోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫలసాయమిచ్చే మొక్కల పెంపకంపై అవగాహన

గుడివాడ రూరల్, జనవరి 24: మండలంలోని రైతులు ఫలసాయాలను ఇచ్చే వృక్షాలను పెంచుకోవాలని ఎంపీడీవో ఎ.వెంకటరమణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఖాళీగా ఉన్న ప్రభుత్వ, కమ్యూనిటీ భూముల్లో మొక్కలు, ఫలసాయాన్ని ఇచ్చే మొక్కల పెంపకంపై ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఉపాధిహామీ పథకం సిబ్బందికి ఎంపీడీవో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో అంతర్గత, అప్రోచ్ రోడ్ల పక్కన, సొంత భూముల్లో 25 సెంట్లకు మించి స్థలాలు చూపిస్తే ప్రభుత్వం మొక్కల మెయింటెన్స్‌కు ఉచితంగా నగదు చెల్లిస్తుందని ఎంపీడీవో తెలిపారు. పండ్ల తోటల పెంపకం ద్వారా లబ్ధిదారునికి మూడేళ్ల వరకు 100 రోజుల వేతన ఉపాధి కల్పిస్తామని, ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటల పెంపకం ద్వారా శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఏపీవో పొలు రాజు, ఈసీ రామకృష్ణ, టీఏ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పార్కును ప్రారంభిస్తున్న రాష్ట్ర పురపాలన, పట్టణ అభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, కలెక్టర్ పి.రాజాబాబు

యర్రా నాగేశ్వరరావు పార్కు ప్రారంభం

మచిలీపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 46వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన యర్రా నాగేశ్వరరావు పార్కును రాష్ట్ర పురపాలన, పట్టణ అభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ గీతాంజలిశర్మ, ఎమ్మెల్యే పేర్నినాని బుధవారం ప్రారంభించారు. పార్కును ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, అమృత్ నిధులు రూ.2.18 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. తన తండ్రి ఐఆర్ఎస్ అధికారిగా పనిచేసిన యర్రానాగేశ్వరరావు విద్యాభ్యాసం హిందూ ఉన్నత పాఠశాల, హిందూ కళాశాలల్లో సాగిందన్నారు. ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో తన తండ్రి పేరున పార్కును ఇక్కడ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజులలో ఈపార్కు నిర్వహణ ఖర్చును తానే భరిస్తానని తెలిపారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ బి.రాజశేఖరరెడ్డి, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, ముడా చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గ, ముడా వీసీ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆధారాల్లేని రూ.5.50 లక్షలు సీజ్

కృత్తివెన్ను, జనవరి 24: లోసరి చెక్‌పోస్టు వద్ద ఎస్సై గణేష్‌కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజోలు నుంచి కృత్తివెన్ను వస్తున్న ఎటువంటి ఆధారాలు లేని రూ.5.50 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, సీజ్ చేసినట్లు సీఐ హబీబ్‌బాషా తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాట్లాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం స్వాధీనం

తోట్లవల్లూరు: కుమ్మమూరు వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా 35 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎం.కిషోర్ బాబు తెలిపారు. పెనమకూరుకు చెందిన బోలెం వెంకటేశ్వరరావు యాకమూరులోని మద్యం షాపు నుంచి కొనుగోలు చేసి తెస్తున్నట్టు తేలిందన్నారు. వెంకటేశ్వరరావును అరెస్ట్ చేశామని తెలిపారు.

నాగాయలంక: దిండి, బర్రంకుల గ్రామాల్లో బుధవారం పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు. దిండిలో మద్యం తరలిస్తున్న భోగాది ప్రభుదాసు నుంచి 6 మద్యం సీసాలను, బర్రంకులలో కమతం నరేష్ బాబు నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

గుడివాడ: ఎన్టీఆర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా గుడివాడ నియోజకవర్గ క్రీడా పోటీలను బుధవారం ఆర్డీవో పి.పద్మావతి ప్రారంభించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, విద్యాశాఖ, క్రీడా శాఖల అధికారులు, పలు ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెడన: ఆడుదాం ఆంధ్ర పెడన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను స్థానిక పల్లోటి స్కూల్‌లో ఎంపీపీ రాజులపాటి వాణి ప్రారంభించారు. ఆడుదాం ఆంధ్ర ప్రత్యేక అధికారి ముదిగొండ ఫణిధూర్జటి, ఎండీవో వి.రెడ్డిమ్మ, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, ఎంఈవో-2 హరనాథ్, ఈవోపీఆర్డీ జయరామ్ పాల్గొన్నారు.

కాలువ చివరి గ్రామాలకు నీళ్లందించండి

• తూడు పేరుకుపోయి చివరకు చేరని నీరు
• కాలువలకు వదిలిన నీటిని చేపల చెరువులకు మళ్లింపు..పట్టించుకోని అధికారులు

నందివాడ (తుమ్మలపల్లి), జనవరి 24: గ్రామాల్లో మంచినీటి చెరువులు పూర్తిగా అడుగంటాయని, కాలువలు తూడుతో నిండిన కారణంగా కాలువ చివరి గ్రామాలకు నీరు చేరే పరిస్థితి లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోసపాడు కాలువపై తుమ్మలపల్లి, నందివాడ మధ్య అడ్డుకట్ట వేసి బుధవారం కొంతమంది రైతులు చేపల చెరువులకు నీళ్లు మళ్లించుకున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు కాంట్రాక్టర్లతో తూడు తొలగింపు పనులు చేపట్టి చివరి గ్రామాలకు మంచి నీళ్లు అందించాలని కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ పవన్‌ను వివరణ కోరగా మురుగునీటినే చేపల చెరువులకు మళ్లిస్తున్నారని తెలిపారు. నాలుగు రోజుల్లో ప్రొక్లెయిన్ ద్వారా తూడు తొలగిస్తామని తెలిపారు





దోసపాడు కాలువపై తుమ్మలపల్లి - నందివాడ మధ్య చేపల చెరువులకు నీళ్లు మళ్లించేందుకు అడ్డుకట్ట వేస్తున్న కూలీలు, కాలువలో పేరుకున్న తూడు